సాక్షి
కామారెడ్డి
సోమవారం। 28। జూలై। 2025



అధ్వానంగా రోడ్లు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు దెబ్బ తింటున్నాయి. పలు రోడ్లు అధ్వానంగా మారాయి.

- 9లో ▸



పొంగుతున్న వాగులు

జిల్లాలో మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
26.9 /22.0

వాతావరణం

చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్ ఆదేశాలతో అప్రోచ్ రోడ్ నిర్మాణం



రామారెడ్డి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు గంగమ్మ వాగుపై అప్రోచ్ రోడ్ నిర్మించి రాకపోకలను పునరుద్ధరించారు. రామారెడ్డి మండల కేంద్ర సమీపంలోని గంగమ్మ వాగులో శనివారం నీటి ప్రవాహం పెరగడంతో రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా రోడ్డును మూసివేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆదివారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గంగమ్మ వాగు వంతెన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. నూతనంగా నిర్మించిన వంతెనకు వెంటనే అప్రోచ్ రోడ్డు నిర్మించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అధికార యంత్రాంగం వేగంగా స్పందించి అప్రోచ్ రోడ్డు నిర్మించి, వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

'పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



సదాశివనగర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మర్కల్ చౌరస్తా వద్ద గల అశోక్ గార్డెన్స్‌లో సంఘం జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానానికి స్వస్తి పలకాలని కోరారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే సెప్టెంబర్ ఒకటో తేదీనుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌నర్సు, రాష్ట్ర కన్వీనర్ గంగాధర్, సీఐటీయూ నాయకులు వెంకట్‌గౌడ్ చంద్రశేఖర్ రాజనర్సు పాల్గొన్నారు.



పులి.. జాడేదీ?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వచ్చిన అరుదైన అతిథి.. ఎటు వెళ్లిందన్న విషయమై స్పష్టత రావడం లేదు. పక్షం రోజులుగా అటవీ అధికారులు వెతుకుతున్నా పెద్దపులి జాడ కనిపించడం లేదు. నిఘా కోసం ఏర్పాటు చేసిన కెమెరాలలోనూ ఎలాంటి ఆధారాలూ రికార్డు కాలేదు. దీంతో అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు భయంభయంగా గడుపుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- పక్షం రోజులుగా వెతుకుతున్నా ఫలితం శూన్యం
- కెమెరాల కంటికీ చిక్కని వైనం
- ఎటువైపు వెళ్లిందన్న దానిపైనా స్పష్టత కరువు
- ఆందోళనలో అటవీ ప్రాంతాల ప్రజలు

రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్‌తండా అటవీ ప్రాంతంలో పక్షం రోజుల క్రితం ఓ ఆవుపై పులి దాడి చేసిన సంఘటన కలకలం రేపింది. దాడి చేసిన ప్రాంతంలో అడుగులను పరిశీలించిన అటవీ శాఖ అధికారులు.. అవి పులివేనన్న నిర్ధారణకు వచ్చారు. పులి తిరుగుతున్నందున అటవీ ప్రాంతానికి వెళ్లొద్దని ఊళ్లల్లో చాటింపు కూడా నిర్వహించారు. అంతకుముందు రోజు నిజామాబాద్ జిల్లా సిరికొండ రేంజ్ పరిధిలోనూ పెద్దపులి సంచరించింది. పులి పాదముద్రలను అటవీ అధికారులు గుర్తించి దాని సంచారాన్ని నిర్ధారించారు. దీంతో పెద్దపులి కోసం అటవీ అధికారులు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు ప్రారంభించారు. కెమెరా ట్రాప్‌లు కూడా ఏర్పాటు చేసి పులి కదలికలను కనుగొనే ప్రయత్నం చేశారు. డ్రోన్ కెమెరాలతోనూ అడవుల్లో జల్లెడ పట్టారు. అటవీశాఖ ఉన్నతాధికారులు కూడా ఆ ప్రాంతానికి వచ్చి వెళ్లారు. పులి ఆచూకీ కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయాలన్న దానిపై సూచనలిచ్చారు. అటవీ అధికారుల ప్రయత్నాలేవీ ఫలించలేదు. పక్షం రోజులు గడుస్తున్నా పులి జాడ కనిపించలేదు.

కెమెరాలను ఏర్పాటు చేసినా..

ఆవుపై దాడి చేసిన ప్రాంతానికి కొద్ది దూరంలో నలువైపులా కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. ఆ కెమెరాలు రాత్రింబవళ్లు పనిచేస్తాయి. ఆ ప్రాంతంలో పులి సంచరిస్తే కచ్చితంగా కెమెరాకు చిక్కుతుంది. దాదాపు 26 కెమెరాలు ఏర్పాటు చేసినట్టు అటవీ అధికారులు చెబుతున్నారు. కెమెరాలను రెగ్యులర్‌గా పరిశీలిస్తున్నారు. కానీ ఏ ఒక్కదానిలోనూ పులి సంచారం రికార్డు కాలేదు. పులి ఆకలి తీర్చుకునేందుకు పశువులపై దాడి చేస్తేనే వాటి యజమానులు విషయాన్ని బయటకు చెబుతారు. ఒకవేళ పులికి ఇతర వన్యప్రాణులు చిక్కితే వాటిని చంపుకుని తింటుంది. అలాంటి సందర్భంలో పులి తిరిగినట్టు ఎవరికీ తెలియదు. పులి తిరుగుతున్న నేపథ్యంలో పశువులు, మేకల కాపరులు అడవి లోపలికి వెళ్లడం లేదు. బయట మేపుతున్నారు. దీంతో పులి సమాచారం తెలియడం లేదు.

తోడు కోసం ఎటువెళ్లిందో..

ఉమ్మడి జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతమైన రామారెడ్డి, సిరికొండ, మాచారెడ్డి, సదాశివనగర్, ధర్పల్లి, ఇందల్వాయి, సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండలాల పరిధిలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. తొలుత సిరికొండ మండలంలో పులి సంచరించినట్లు గుర్తించారు. తర్వాత పక్కనే ఉన్న రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట స్కూల్‌తండా అటవీ ప్రాంతంలో పులి ఆనవాళ్లు కనిపించాయి. అక్కడి నుంచి ఎటువైపు వెళ్లిందన్న దానిపై స్పష్టత లేదు. పులి తోడు కోసం వెతుకులాడుతూ ఎటు వెళ్లి ఉంటుందో అన్న విషయం తేలడం లేదు. ఈ ప్రయాణంలో ఆకలి తీర్చుకునేందుకు పశువులపై దాడి చేస్తుందని, లేదంటే అడవి జంతువులను వేటాడుతుందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

భయంభయంగా..

పులి వచ్చిందన్న విషయాన్ని అటవీ శాఖ అధికారులు ధ్రువీకరించిన నేపథ్యంలో అటవీ ప్రాంత గ్రామాల ప్రజల్లో భయం నెలకొంది. పశువులు, మేకలను మేతకు తీసుకువెళ్లినపుడు ఎక్కడ తమపై దాడి చేస్తుందోనన్న ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంటల సీజన్ కూడా కావడంతో రైతులు పొలాల్లో ఉండాల్సి వస్తుంది. సాగు భూములు చాలావరకు అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్నాయి. అక్కడ ఎటువైపు నుంచి పులి వస్తుందోనన్న భయం చాలా మందిని వెన్నాడుతోంది. పులి జాడ కోసం పెట్రోలింగ్ కొనసాగుతోందని అటవీ అధికారులు పేర్కొంటున్నారు.

మళ్లింపు జలాలు.. మంజీర పాలు



కల్యాణి ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా మంజీర నదిలోకి వెళ్తున్న నీరు

- ఆయకట్టుకు మళ్లించని అధికారులు
- విస్మయం వ్యక్తం చేస్తున్న రైతులు

నిజాంసాగర్: ఆయకట్టు ప్రాంత పంటలకు చెరువులు, కుంటలకు ఉపయోగపడాల్సిన మళ్లింపు పథకాల జలాలు మంజీర పాలవుతున్నాయి. దీంతో రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిజాంసాగర్ ప్రధాన కాలువ మొదటి ఆయకట్టు ప్రాంతంలోని కుంటలు, చెరువులు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి. అయితే అదనపు జలాలను నిజాంసాగర్ ఆయకట్టుకు మళ్లించేందుకోసం నిర్మించిన కల్యాణి ప్రాజెక్టు మాత్రం నిండుకుండలా మారింది. దీంతో అధికారులు ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువకు కాకుండా మంజీర లోకి వదులుతున్నారు.

ప్రధాన కాలువ పరిధిలోని గున్కుల్, బూర్గుల్, కోమలంచ, గాలిపూర్, మగ్దుంపూర్, తిర్మలాపూర్, తాడ్కోల్, బుడ్మి, బాన్సువాడ ప్రాంతంలోని కుంటలు, చెరువుల్లో నీరు చేరలేదు. ఆయా ప్రాంతాల్లో మోస్తారు వర్షాలే కురిశాయి. కల్యాణి ప్రాజెక్టు ద్వారా వదులుతున్న నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లిస్తే ఆయకట్టుతో పాటు కుంటలు, చెరువులకు ఉపయోగకరంగా ఉండేది. కానీ అధికారులు మాత్రం మంజీరలోకి వదులుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్యాణి ప్రాజెక్టు నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లించి ఆయకట్టును ఆదుకోవాలని కోరుతున్నారు.

కల్యాణి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

ఎల్లారెడ్డి: తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 409.50 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 408.50 అడుగుల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 330 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో అంతే నీటిని ప్రాజెక్టు రెండు వరద గేట్ల ద్వారా మంజీర నదిలోకి వదులుతున్నారు.

నిజాంసాగర్‌లోకి 1,828 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం



పోచారం ప్రాజెక్టులో చేరిన నీరు

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,828 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మెదక్ జిల్లా ఘనపురం ఆనకట్టతో పాటు హల్దీ వాగు ద్వారా ప్రాజెక్టుకు వరద వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,391 అడుగుల (4.47 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

పోచారంలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయం 4,784 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా సాయంత్రానికి 1,800 క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చరిత్రలో నిలిచిపోతాయి
- 'అలయ్ బలయ్'లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి బహుజనులందరు ఐక్యంగా ఉండాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్ కీ బార్ చార్ సౌ పార్ అన్న కేంద్ర ప్రభుత్వ అహంకారాన్ని రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా అడ్డుకున్నామన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనువాదాన్ని తీసుకు రావాలనుకుంటున్నవారి కలలు కలలుగానే మిగిలిపోతాయన్నారు. కంచె ఐలయ్య లాంటి మేధావులు ఈరోజు బయటకు వచ్చి రాహుల్ గాంధీ నాయకత్వాన్ని సమర్థిస్తున్నారన్నారు. దేశంలోనే మొదటిసారిగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కామారెడ్డిలో నిర్వహించిన బహుజన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బహుజన, అంబేడ్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీపీవో, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షలు

కామారెడ్డి క్రైం: గ్రామ పాలన అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఎంపిక కోసం ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు గ్రామ పాలన అధికారుల పరీక్ష జరిగిందని, 109 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 81 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయన్నారు.

122 మంది దరఖాస్తు చేసుకోగా 19 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో మస్రూర్ అహ్మద్ పరిశీలించారు.



పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

రేపు జిల్లా స్థాయి ట్రయథ్లాన్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మంగళవారం ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి జూనియర్స్, సీనియర్స్ ట్రయాథ్లాన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్ రెడ్డి, అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పీఈటీలు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయా పాఠశాలల క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరయ్యేలా చూడాలని కోరారు.

రేపు దోమకొండకు మంత్రుల రాక

దోమకొండ: మండల కేంద్రానికి మంగళవారం మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రానున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో జరిగే రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

ఎస్సారెస్పీకి 'మహా' వరద

బాల్కొండ: మహారాష్ట్రలోని విష్ణుపురి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. మహారాష్ట్ర ప్రాంతం నుంచి 48 వేల క్యూసెక్కులు, స్థానిక ఎగువ ప్రాంతాల నుంచి 5 వేల క్యూసెక్కుల చొప్పున ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం రాత్రి వరకు 1070.8(25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

రోడ్ల విస్తరణకు రాజకీయ గ్రహణం!

- కొలతలు వేసినా మార్కింగ్‌కే పరిమితం
- ఏళ్లు గడుస్తున్నా ముందుకు పడని అడుగు
- ఇరుకు రోడ్లతో ప్రజలకు తప్పని ఇబ్బందులు



ఇరుకుగా ఉన్న సిరిసిల్ల రోడ్డు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కారం కావడం లేదు. రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడంతో సమస్య రోజురోజుకు పెరుగుతోంది. కామారెడ్డి పట్టణం నాలుగు దశాబ్దాల కిందటే మున్సిపాలిటీగా ఎదిగింది. వ్యాపార, వాణిజ్య కేంద్రం కావడంతో పట్టణం అన్నివైపులా విస్తరించింది. పట్టణ విస్తరణకు అనుగుణంగా అప్పట్లో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఏళ్లు గడిచినా అది అమలుకు నోచుకోవడం లేదు. ప్రధాన రోడ్లు విస్తరణకు నోచుకోకపోగా, భారీ డివైడర్లను నిర్మించడం, రోడ్లకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు, భవనాల యజమానులు ముందుకు జరిగి నిర్మాణాలు చేపట్టడం దానికి తోడు వాహనాల పార్కింగులతో రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. ఇక్కడ రోడ్ల విస్తరణ విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. పట్టణంలో బిజినెస్ ఏరియాల్లో నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు తప్ప ఎక్కడ పార్కింగ్ చేయాలో పరిష్కారం చూపడం లేదు. దీంతో షాపింగ్‌కు వచ్చిన వాళ్లంతా తమ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని పరిస్థితి ఉంది. పట్టణంలో రోడ్ల విస్తరణకు అడుగులు పడాలన్న ఉద్దేశంతో ప్రస్తుత ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అడ్లూర్ రోడ్డులో ఉన్న తన ఇంటిని కూల్చివేయించారు. ఆయన కొంత కాలం రోడ్డు విస్తరణ జరగాల్సిందేనని మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అధికారులు కొలతలు వేసి ఆయా ప్రాంతాల్లో మార్కింగ్ చేశారు. ఏడాది గడిచిపోయినా పనులు మొదలుకాలేదు. రోడ్డు విస్తరణ పనులపై ఇటీవల ఎమ్మెల్యే కూడా పెద్దగా మాట్లాడడం లేదు. దీంతో సమస్య అలాగే ఉండిపోయింది.

రాజకీయాలే కారణం..

రోడ్లను విస్తరించాలంటే చాలాచోట్ల ఇళ్లను కూల్చాల్సి ఉంటుంది. అయితే విస్తరణలో ఇళ్లు కోల్పోయేవారు తమకు దూరమవుతారన్న భావనతో నేతలు ముందడుగు వేయడం లేదు. రోడ్ల విస్తరణలో కొందరికి నష్టం జరగొచ్చుగానీ వేలాది మంది ప్రజల ఇబ్బందులు తొలగుతాయన్న విషయాన్ని ఎవరూ గుర్తించడం లేదు. రాజకీయాలకు అతీతంగా కదిలి రోడ్ల విస్తరణ జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆక్రమణలతో ఇరుకుగా మారిన అశోక్‌నగర్ రోడ్డు

సిరిసిల్ల రోడ్డులో మరీ దారుణం..

జిల్లా కేంద్రంలో కీలక ప్రాంతమైన సిరిసిల్ల రోడ్డు విస్తరణకు నోచుకోవడంలేదు. ఈ రోడ్డు గుండా పొద్దస్తమానం బస్సులు, లారీలు, కార్లు.. వేలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. దశాబ్దాల కాలంగా రోడ్డు విస్తరణకు నోచుకోవడం లేదు. గతంలో ఈ రోడ్డును విస్తరించాలని నిర్ణయించినా.. కొందరు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో ఆ నిర్ణయం అమలు కాలేదు. ఆ తర్వాత రోడ్డు విస్తరణను పట్టించుకునేవారు కరువయ్యారు. అసలే ఇరుకుగా ఉన్న రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించడంతో మరింత ఇరుకుగా మారింది. దీంతో రోడ్డుపై పెద్ద వాహనాలు ఆగితే మరో వాహనం దానిని దాటి వెళ్లే పరిస్థితి ఉండడం లేదు. ఇందిరాచౌక్ నుంచి దాదాపు బైపాస్ రోడ్డు వరకు రోడ్డును విస్తరించాల్సి ఉంది. అలాగే స్టేషన్ రోడ్డులో వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేదు. దీంతో నీరంతా రోడ్డుపై నిలిచిపోతుంది. చిరుజల్లులకే నీరు నిలిచిపోయి వాహనదారులతో పాటు దుకాణాల యజమానులూ ఇబ్బంది పడుతుంటారు. భారీవర్షం కురిసినపుడు చెరువును తలపిస్తుంది. రైల్వే బ్రిడ్జి నుంచి ఇందిరాచౌక్ దాకా రోడ్డు ఇరుకుగా మారిపోయింది. దానికితోడు దుకాణాల వద్ద వాహనాలు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.

జన్మభూమి రోడ్డు నుంచి పాత బస్టాండ్ వరకు..

పట్టణంలో జన్మభూమి రోడ్డు నుంచి సాయిబాబా టెంపుల్, ఆర్‌కే లాడ్జి రోడ్డు మీదుగా అశోక్‌నగర్, రైల్వే గేట్, అడ్లూర్‌రోడ్డు గుండా పాతబస్టాండ్ వరకు దాదాపు మూడు కిలోమీటర్ల రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 ఫీట్లు ఉండాలి. కానీ చాలాచోట్ల 30 ఫీట్ల నుంచి 40 ఫీట్లకు తగ్గిపోయింది. ఆర్‌కే లాడ్జి రోడ్డులో ఇళ్ల యజమానులు ముందుకు జరిగి షెడ్లు నిర్మించి దుకాణాలు, హోటళ్లకు అద్దెకు ఇచ్చుకున్నారు. దీంతో ఇక్కడ రోడ్డు మరింత ఇరుకుగా మారింది. ఈ రోడ్డు గుండా విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, కాకతీయనగర్, విద్యుత్ నగర్, దేవునిపల్లి తదితర ప్రాంతాలకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు ఇరుకుగా ఉండడంతో రోజూ ఇబ్బందుల పడాల్సి వస్తోంది. జన్మభూమి రోడ్డులోనూ ముందుకు జరిగి షెడ్లు, ఇళ్లు నిర్మించుకుని అద్దెకు ఇచ్చుకున్నారు. అశోక్‌నగర్ రోడ్డులో పరిస్థితి మరింత దారుణం ఉంది. రోడ్డు ఇరుకుగా ఉండడం, దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనికితోడు రోడ్డు అధ్వానంగా మారింది. ఇదే రోడ్డు గుండా రైల్వే గేటునుంచి అడ్లూర్ రోడ్డుకు వెళ్లే సరికి అక్కడా ఇరుకైన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారు. దర్శన్ టాకీస్ నుంచి శాంతిటాకీస్ మీదుగా పాతబస్టాండ్ వరకు రోడ్డు కూడా ఇరుకుగా ఉంది.



అధ్వానంగా ఉన్న జన్మభూమి రోడ్డు



ఇరుకుగా మారిన పాతబస్టాండ్ - దర్శన్ టాకీస్‌రోడ్డు

క్లుప్తంగా

వర్షాలకు రోడ్డుపై కూలిన మర్రిచెట్టు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద గల కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డుపై ఆదివారం ఉదయం భారీ మర్రిచెట్టు కూలింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వెంటనే ఎస్సై దీపక్‌కుమార్ స్పందించి కటింగ్ మిషన్, పొక్లెయిన్ సాయంతో మర్రి చెట్టును తొలగించారు. అనంతరం రాకపోకలను పునరుద్ధరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్టు నేలవాలింది.

మంకీ గన్లకు భలే గిరాకీ..!



ఎల్లారెడ్డి: కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. కోతుల నివారణకు మంకీ గన్లు బాగా ఉపయోగపడుతుండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు. పట్టణంలో మంకీ గన్లు విక్రయించేందుకు రావడంతో స్థానికులు వాటిని కొనుగోలు చేశారు. సుమారు రూ.150కి విక్రయదారులు అమ్ముతున్నారు. మంకీగన్లలో సున్నపురాయిని వేసి దానిలో రెండు చుక్కల నీటిని పోసి అటు ఇటు తిప్పి లైటర్‌ను ఆన్‌చేస్తే భారీ శబ్దం రావడంతో కోతులు పారిపోతున్నాయని స్థానికులు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి అన్నారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో 'మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి' అనే సందేశంతో రూపొందించిన వాల్ పోస్టర్‌లను లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి విజయ్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో అతికించారు. మత్తు పదార్థాలపై యువత, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

కుక్కలతో విద్యార్థులు పరేషాన్



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిత్యం కుక్కల గుంపు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పందులు పాఠశాలలోని వస్తున్నాయని వారు అంటున్నారు. ఇటీవల కుక్కల గుంపు పలువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కుక్కలను ఆరికట్టాలని, పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని వారు కోరుతున్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు



హన్మాజీపేట్ శివారులో పొంగి పొర్లుతున్న కోనాపూర్ మత్తడి



కొయ్యగుట్టలోని చదల వాగు సమీపంలో నీట మునిగిన పంటపొలాలు

బాన్సువాడ రూరల్: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో వాగులు పొంగిపొర్లుతున్నాయి. హన్మాజీపేట్ శివారులోని కోనాపూర్ మత్తడి ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే కొయ్యగుట్ట శివారులోని చదలవాగు పొంగిపొర్లుతుండటంతో సమీపంలోని పంటపొలాలు నీటమునిగాయి. కొల్లూర్ వాగు నిండుగా ప్రవహిస్తోంది. కురిసిన వర్షాలతో గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి.

నస్రుల్లాబాద్‌లో 6 సెంటీమీటర్ల వర్షపాతం

నస్రుల్లాబాద్: మండలంలోని శనివారం రాత్రి 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు స్థానిక తహసీల్దార్ సువర్ణ తెలిపారు. నిరంతరం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకూడదన్నారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆమె సూచించారు. గ్రామ స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

నిండిన చెరువులు, కుంటలు..



అడివిలింగాల శివారులో అలుగు పారుతున్న చెక్‌డ్యాం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలో కురిసిన వర్షాలకు పలు గ్రామాలలోని చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. జాన్కంపల్లి ఖుర్దు శివారులోని తాటివాని మత్తడి చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతుండగా, అడివిలింగాల గ్రామ శివారులో గల చెక్‌డ్యాం పూర్తిగా నిండి అలుగెళ్తోంది.

కామారెడ్డి చెరువులోకి వరద నీరు



కామారెడ్డి పెద్ద చెరువులోకి వస్తోన్న వరదనీరు

కామారెడ్డి అర్బన్: పాత పట్టణానికి నీరందించడమే కాకుండా భూగర్భ జలాల వృద్ధికి ఉపయోగపడే కామారెడ్డి పెద్ద చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. మూడు రోజులుగా కురుస్తున్న వానలతో ఉమ్మడి తాడ్వాయి మండలంలోని చిట్యాల, సంతాయిపేట, సోమారం, ఆర్గొండ, అన్నారం, వంకాయపల్లి తదితర ప్రాంతాల నుంచి గుండమ్మ వాగు ద్వారా కామారెడ్డి చెరువులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దాదాపు 800 ఎకరాల ఆయకట్టు గల ఈ చెరువు తూములను 20 ఏళ్ల క్రితం మూసేసి కామారెడ్డి పట్టణానికి నీరందిస్తున్నారు. ఇంకా దాదాపు 20 సెంటీమీటర్ల మేర వానలు కురిస్తే ఎగువ ప్రాంతాల్లో కుంటలు నిండి భారీగా వరద నీరు వచ్చి అలుగు పారే అవకావం ఉంటుందని అంటున్నారు.

చెరువులకు జలకళ



జలకళ సంతరించుకున్న లింగంపేట ఊర చెరువు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలంతో పాటు గాంధారి మండలంలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దవాగు పొంగి ప్రవహించింది. దాంతో పెద్దవాగు పరివాహక గ్రామాల ఊర చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరుతుంది. మండలంలోని పలు గ్రామాల చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఊర చెరువుల్లోకి నీరు రావడంతో ఆయకట్టు రైతులు వరి పంట సాగు పనులు ముమ్మరం చేశారు. లింగంపేట ఊర చెరువు నీటితో నిండిపోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. ఖరీఫ్ సీజన్‌కు ఢోకాలేదని రైతులు పేర్కొన్నారు. వాగులు, చెరువులు రెండు రోజులుగా కురిసిన వర్షానికి కొత్త నీటితో కళకళలాడుతున్నాయి. వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి.

విద్యుత్ తీగల కింద నాటారు.. పెరిగాక నరికారు



డబుల్‌బెడ్ రూం కాలనీ రోడ్డులో నరికేసిన చెట్లు

బాన్సువాడ రూరల్: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారాయి. నాటిన సమయంలో ముందుచూపుతో వ్యవహరించకుండా విద్యుత్ తీగల కింద నాటారు. ప్రస్తుతం చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతుండటంతో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతోందనే కారణంతో వాటిని నరికేస్తున్నారు. దీంతో ఇన్నేళ్లుగా పచ్చదనంతో పాటు పర్యావరణాన్ని కాపాడిన చెట్లు సమూలంగా నరికివేతకు గురవుతున్నాయి. అధికారులు వీలైతే విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చి చెట్లను కాపాడాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. లేదంటే విద్యుత్ స్తంభాల కింద నాటకుండా వేరే చోట్ల నాటాలని విన్నవిస్తున్నారు.

గుంతలు తీశారు.. పూడ్చడం మరిచారు



కొత్తాబాదిలో రోడ్డు పక్కన పూడ్చని గుంతలు

బాన్సువాడ రూరల్: కొత్తాబాదిలో పైప్‌లైన్ లీకేజీలను అరికట్టడానికి పక్షం రోజుల క్రితం గుంతలు తవ్వారు. లీకేజీలను సరిచేసి వెంటనే గుంతలను పూడ్చకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. గ్రామంలో మోడల్‌స్కూల్ ఉండటంతో నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ రోడ్డుగుండా రాకపోకలు సాగిస్తుంటారు. తవ్విన మట్టి రోడ్డుపైనే వేయడంతో విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు, స్కూల్‌బస్సులు, ఆటోలు ఈ రోడ్డు గుండా వెళ్లడానికి ఇబ్బంది కలుగుతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గణేష్‌ను వివరణ కోరగా.. జేసీబీ రాకపోవడంతో ఆలస్యమైందని త్వరలోనే పూడ్చి వేయిస్తామన్నారు.

ప్రారంభమైన జెండా బాలాజీ జాతర

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెండాగల్లీలో గల వేంకటేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం సర్వసమాజ్ ఆధ్వర్యంలో జెండా బాలాజీ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా జెండాతో ఆలయం చుట్టు ఐదు ప్రదిక్షణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ప్రతిష్ఠించారు. భక్తులు 9రోజుల పాటు ఆలయంలోని జెండాకు పూజలు చేయనున్నారు. అంతకుముందు జెండాతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆగస్టు 5న జెండాను అంకాపూర్ గ్రామస్తులకు అప్పగించనున్నారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో జెండా కు ప్రత్యేక పూజలు చేశారు. అధ్యక్షుడు సుమన్, సర్వసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో లోఓల్టేజ్‌తో సమస్యలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలో లోఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. మండల వ్యాప్తంగా ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తితే ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, ఒక జూనియర్ లైన్‌మెన్ మాత్రమే ఉన్నారు. పెద్దకొడప్‌గల్‌లో ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం వరకు లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడ్డారు. లైన్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ లైన్‌మెన్ అనారోగ్యంతో సెలవులో ఉండటంతో ఉదయం నుంచి పనులు నిలిచిపోయాయి. సింగిల్ మోటర్ బోర్లు నడవకపోవడంతో నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని నియమించి ప్రజల సమస్యలను తీర్చాలని కోరుతున్నారు.

ప్రమాదపు అంచున పర్యాటకులు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరుతుండటంతో ప్రాజెక్ట్ సందర్శనకు పర్యాటకులు తరలివస్తున్నారు. కానీ పర్యాటకులు ప్రాజెక్టు లోపలికి వెళ్లడంతోపాటు, నీటి అంచున ఫొటో షూట్‌లు, సెల్ఫీలు దిగుతున్నారు. దీంతో పర్యాటకులు ప్రమాదవశాత్తు నీట మునిగే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రాజెక్టు అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వర్షపాతాన్ని ఎలా కొలుస్తారు?

మీకు తెలుసా?



రెయిన్ గేజ్ (వర్షమాపకం)

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎప్పుడైన వర్షం కురిస్తే, ఎంత కురిసిందో వాతావరణ శాఖ మాత్రమే చెబుతుంది.

- వర్షపాతాన్ని తెలుసుకునేందుకు రెయిన్ గేజ్‌లను (వర్షమాపకాలు) ఉపయోగిస్తారు. వాటిని వాతావరణ ప్రధాన కేంద్రమైన పూణేలో ప్రత్యేక ల్యాబ్‌లో తయారు చేస్తారు.
- రెయిన్ గేజ్‌లలో రెండు రకాలున్నాయి. ఒకటి సెల్ఫ్ రికార్డింగ్ రెయిన్ గేజ్. దీనిని నేలపై బోరు పైపులా ఏర్పాటు చేస్తారు. పైపులో గ్రాఫ్ రోలర్ బిగించి ఉంచుతారు. వర్షం పడిన సమయంలో నీరు సన్నని రంధ్రంలోకి చేరడం వలన ఎప్పటికప్పుడు గ్రాఫ్‌లో నమోదు చేస్తుంది.
- రెయిన్ గేజ్‌లో రెండో రకం ఆర్డినరీ రెయిన్ గేజ్. ఇది ప్రతి మూడు గంటలకోసారి వర్షపాతాన్ని నమోదు చేస్తుంది. ఉదయం 8:30 గంటలకు, 11:30 గంటలకు మధ్యాహ్నం 2:30 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు వర్షపాతాన్ని తీస్తారు.
- ఇదే పద్ధతిలో రాత్రి నుంచి వేకువజాము వరకు కూడా మూడు గంటలకోసారి కొలుస్తారు.
- ఈ ఆర్డినరీ రెయిన్ గేజ్‌లు ప్రతి మండలానికి ఒకటి తహసీల్ ఆఫీసు ఆవరణలో ఉంటుంది. అలాగే సబ్ స్టేషన్లలో కూడా ఉంటాయి.
- వీటి రక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్ ఉంటుంది. చూడటానికి బోరు పైపు మాదిరిగా ఉంటుంది. సన్నని రంధ్రం ద్వారా వర్షపునీరు వెళ్లి లోపల ఉన్న ఒక కంటెయినర్ (డబ్బా)లో చేరుతుంది.
- అలా డబ్బాలోకి చేరిన నీటిని ప్లాస్క్ మగ్‌లోకి పోసి కొలుస్తారు. వర్షపాతాన్ని మిల్లీ మీటర్లు, సెంటీ మీటర్లలో కొలుస్తారు. 10 మిల్లీ మీటర్లకు ఒక సెంటీ మీటరు అంటారు.
- ఈ వర్షపాతం వివరాలను సేకరించి ప్రభుత్వాలకు పంపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుంటారు. వాతావరణ శాఖ నుంచి సైంటిఫిక్ అసిస్టెంట్లు, ముఖ్య ప్రణాళిక శాఖ నుంచి అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో)లు ఉంటారు.

సమాచారం..

నేడు నాగులమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం సమీపంలో సోమవారం నాగులమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వేదబ్రాహ్మణుడు సంతోష్‌కృష్ణ శర్మ తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మండల స్థాయి ప్రజావేదిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం మండల స్థాయి ఉపాధి హామీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల వివరాలను వెల్లడించి.. ఏ పనులకు ఎన్ని నిధులు కేటాయించారనే విషయాన్ని తెలియజేస్తామన్నారు.

కలెక్టరేట్ ఎదుట మత్స్యకారుల మహాధర్నా

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్ ఎదుట సోమవారం ఉదయం 11గంటలకు మత్స్యకారుల మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ మత్స్యకారుల, కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్కి గంగారాం, రఘుపతి మధుసూదన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మత్స్యకారులు తరలిరావాలని వారు కోరారు.

డిగ్రీ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యాసంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయని స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ శంకర్ రావు తెలిపారు. 2 సంవత్సరాల ఇంటర్ పాసైన వారు డిగ్రీలో నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు కులధ్రువీకరణ, ఆధార్‌కార్డు, ఫొటోలతో ఏదైనా ఆన్‌లైన్ సెంటర్‌లో దరఖాస్తు చేసి ఫారాన్ని స్టడీసెంటర్‌లో అందజేసి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు 13 వరకు అడ్మిషన్ పొందడానికి గడువు ఉందన్నారు. గత ఏడాది డిగ్రీ మొదటి, రెండో సంవత్సరంలో చేరిన వారు ఈ ఏడాది రెండో, మూడో సంవత్సరానికి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. వివరాలకు శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కొనసాగుతున్న స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



మాట్లాడుతున్న నిర్వాహకులు

బీబీపేట: మండల కేంద్రంలోని వాసవి క్లబ్‌లో ఆదివారం సిద్దిపేటకు చెందిన కృష్ణ సాయి కంటి ఆస్పత్రి, సెంటర్ ఫర్ సైట్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 185 మందికి పరీక్షలు జరిపారు. పలువురికి శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సిందిగా సిఫారసు చేశారు. అవసరమైన వారికి ఉచితముగా శస్త్ర చికిత్సలు సిద్ధిపేటలో గల కృష్ణ సాయి ఆస్పత్రి చేస్తామని వారు తెలిపారు. సెంటర్ ఫర్ సైట్ నిర్వాహకులు హరీష్, వాసవి క్లబ్ అధ్యక్షుడు నాగభూషణం, కోశాధికారి రెడ్డిశెట్టి నాగభూషణం, విశ్వ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు



ఎల్లారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్(బాలుర) 1989-90 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

- జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వ విద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు

సాక్షి నెట్‌వర్క్: ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.





ధర్పల్లి జెడ్పీహెచ్‌ఎస్ 2009 బ్యాచ్ విద్యార్థులు, బీబీపేట జెడ్పీహెచ్‌ఎస్(బాలుర) 2000 బ్యాచ్ విద్యార్థులు

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న లారీ



రుద్రూర్: పోతంగల్ చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం ఓ కంకర లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొని బోల్తా పడింది. బీర్కూర్ నుంచి కోటగిరి మండలం ఎత్తోండకు కంకర లోడ్‌తో లారీ బయలుదేరింది. పోతంగల్ శివారులో మూల మలుపు వద్ద లారీ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో రెండు స్తంభాలు విరిగిపోగ, మరో రెండు దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా ఉండగా, వెంటనే అధికారులు సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనపై విద్యుత్‌శాఖ ఏఈ ఫక్రుద్దిన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.80 వేల నష్టం జరిగినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డట్టు స్థానికులు తెలిపారు.

నకిలీ నంబర్‌ప్లేట్‌తో సంచారం

- వాహనదారుడిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం: నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనాన్ని నడుపుతున్న వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌లోని వినాయక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల స్కూటీని కొనుగోలు చేశాడు. నిజామాబాద్‌లోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అదే నంబర్ ప్లేట్‌తో కామారెడ్డిలో మరో వ్యక్తి బైక్‌ను నడుపుతున్నాడు. ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులు దీనిని గమనించి అతడిని, వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ చలానాలు తప్పించుకోవడం, నేరం చేసినా దొరకకుండా ఉండడం కోసమే నంబర్ ప్లేట్ మార్చుకుని తిరుగుతున్నాడని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: బోర్గాం(పి)లోని గూడెం కాలనీకి చెందిన రామకృష్ణ ఇంట్లో ఇంట్లో శనివారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనతో మంటలు వ్యాపించడంతో ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ. 6లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు రామకృష్ణ తెలిపారు. దీనిపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అక్క బాగు కోసం.. బావ మృతికి కారణమై..

- కటకటాల పాలైన నిందితుడు

సిరికొండ: ఆత్మహత్యకు యత్నించిన బావను ఆస్పత్రికి తీసుకెళ్లకుండ, పొదల్లో వదిలేసి, మృతికి కారణమైన నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరికొండ ఎస్సై రామకృష్ణ ఆదివారం వివరాలు వెల్లడించారు. మండలంలోని మైలారం గ్రామ శివారులో ఈ నెల 25న లభ్యమైన వ్యక్తి మృతదేహం కేసులో విచారణ చేపట్టి, ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. మృతుడిని ఖాజామోహీనోద్దీన్(43)గా గుర్తించగా, అతడు మంకమ్మతోట కరీంనగర్‌కు చెందిన వ్యక్తి కాగా ఆర్మూర్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. అతడు తరచు మద్యం తాగుతూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో ఖాజామోహీనోద్దీన్ ఈ నెల 23న రామన్నపేట్‌లో సెంట్రింగ్ పని చేసేచోట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో అతడి బావమరిది షేక్ లాయక్ అలియాస్ బబ్లు అక్కడే ఉన్నాడు. అతడు బావను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా, చనిపోతేనే తన అక్క బాగుంటుందని భావించాడు. దీంతో మరో వ్యక్తి అబ్దుల్ జబ్బర్ సాయంతో అతడు మృతదేహాన్ని బైక్‌పై మైలారం శివారులోని చెరువు కట్టపై వదిలేసి వెళ్లిపోయారు. మృతుడికి సరైన వైద్యం అందించకుండా మృతికి కారణమైన షేక్ లాయక్, అబ్దుల్ జబ్బర్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ధర్పల్లి సీఐ భిక్షపతి, సిరికొండ ఎస్సై, సిబ్బందిని ఏసీపీ అభినందించారని ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

దుబాయ్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహం

- తలకొరివి పెట్టిన తల్లి



నీరడి భోజన్న (ఫైల్)

దిచ్‌పల్లి/ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దుబాయ్‌లో కొన్ని రోజుల క్రితం మృతిచెందగా ఆదివారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి గ్రామానికి చెందిన నీరడి భోజన్న (44) ఉపాధి నిమిత్తం కొన్ని రోజుల క్రితం దుబాయి వెళ్లాడు. 20 రోజుల క్రితం అనారోగ్యానికి గురై, గుండెపోటు రావడంతో అక్కడి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబాయ్‌లోనే ఉంటున్న అతడి తమ్ముడు మృతదేహాన్ని గ్రామానికి పంపించేందుకు కంపెనీ చుట్టూ తిరిగిన పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న యూఏఈ తెలుగు హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ కంపెనీ వారితో మాట్లాడగా, మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు సహకరించింది. ఆర్గనైజేషన్‌కు చెందిన అజ్మన్ ఇన్‌చార్జి భూమేష్ సహకారంతో అన్ని రకాల అనుమతులు తీసుకున్నారు. మృతుడు తమ్ముడికి టికెట్టు సమకూర్చి మృతదేహాన్ని ఇండియాకు పంపించారు. ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న మృతదేహానికి తల్లి లింగవ్వ తలకొరివి పెట్టింది. మృతుడు భోజన్నకు భార్య సుమ (ప్రస్తుతం నిండు గర్భిణీ), ఒక కూతురు ఉంది. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు, తెలుగు హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ సభ్యులు కోరుతున్నారు.

పోచారంలో పోచమ్మ గుడి, పుట్ట ధ్వంసం

బోధన్: ఎడపల్లి మండలం పోచారం గ్రామ శివారులో చెట్ల కింద ఉన్న నాగదేవత పుట్ట, పోచమ్మ గుడిని గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీతో తవ్వేశారని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు ఆదివారం ఉదయం గుడి వైపు వెళ్లగా ఆలయ ధ్వంసంను గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ప్రతి ఏటా నాగుల పంచమినాడు గ్రామంలోని మహిళలు ఇక్కడి పుట్టకు పూజలు చేసి పాలుపోస్తారని మంగళవారం నాగుల పంచమి ఉండగా పుట్ట ధ్వంసం కావడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎడపల్లి ఎస్సై రమా సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆలయ పునఃనిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



బాల్కొండ: మండల కేంద్రంలోని తాళం వేసిన రెండిళ్లలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, ఎస్సై శైలెందర్ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పుట్టి సుమంతి ఇంటికి తాళం వేసి ఉండగా శనివారం అర్ధరాత్రి దుండగులు తాళం పగులగొట్టి, ఇంట్లోని 6.7 తులాల బంగారం, ఆరు తులాల వెండి, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే అదే గ్రామంలోని తాళం వేసి ఉన్న సంతోష్ గౌడ్ ఇంట్లోకి దుండగులు చొరబడి నగదును చోరీ చేశారు. ఉదయం స్థానికులు చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శైలెందర్ సిబ్బందితో వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ వైరు..

ధర్పల్లి: మండల కేంద్రం శివారులోని పంట పొలాల వద్ద సుమారు 20 వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఆదివారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు సబ్‌మెర్సిబుల్ మోటారు నుంచి మెయిన్ బోర్డ్ వరకు ఉండే కేబుల్ వైర్లు కట్ చేసి ఉండడాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వారు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు. పంటలకు నీరు పెట్టాలంటే మళ్లీ ప్రతి మోటార్‌కు కేబుల్ వైరు కొనాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు రాత్రి సమయంలో గట్టి నిఘా పెట్టి దొంగలను పట్టుకుని కేబుల్ వైర్ చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.